సాక్షి
ఖమ్మం
ఆదివారం । 9 । మార్చి । 2025



అతిథులకు ఆహ్వానం
రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు గిరిజన సంస్కృతిని వివరించేలా భద్రాచలంలోని గిరిజన మ్యూజియం ఆవరణను తీర్చిదిద్దుతున్నారు. 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆదివారం సా॥) 6.23
సహర్ (సోమవారం ఉ॥) 5.05

వాతావరణం
గరిష్టం / కనిష్టం 37° / 21°
జిల్లాలో ఆదివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి మరింత పెరిగినా.. రాత్రి మళ్లీ చలి మొదలవుతుంది.

పాలు.. మురిపాలు

మాతృత్వాన్ని పెళ్లయిన మహిళలు వరంలా భావిస్తూ ఆ క్షణాల కోసం ఎదురుచూస్తుంటారు. అయితే, కొందరికి తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం, ఇంకొందరికి పాలు రాని పరిస్థితుల్లో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన మెగా మదర్ మిల్క్ బ్యాంక్ వరప్రదాయినిగా మారుతోంది. శిశు మరణాలు తగ్గించడం, వారిని ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రంలో మొదటిది, దేశంలో ఐదవదిగా ఖమ్మం ఎంసీహెచ్‌లో రూ.1.15 కోట్ల వ్యయంతో తల్లిపాల సేకరణ కేంద్రాన్ని 2022 ఏప్రిల్ 30న ప్రారంభించారు. హైదరాబాద్ నిలోఫర్, వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో ఇలాంటి కేంద్రాలు ఉన్నా ఖమ్మంలో మాత్రం మెగా మిల్క్‌బ్యాంక్ కావడంతో వేలాది మందికి ఆసరా అవుతోంది.
– ఖమ్మంవైద్యవిభాగం



సేకరించి, పిల్లలకు ఇచ్చిన పాల వివరాలు

సమయం	బాలింతలు	సేకరించిన పాలు (లీ.ల్లో)	లబ్ధి పొందిన శిశువులు	అందించిన పాలు (లీ.ల్లో)
2022 మే – డిసెంబర్	396	139	480	138
2023 జనవరి – డిసెంబర్	901	277.77	1,145	239.75
2024 జనవరి – డిసెంబర్	929	295.51	3,851	288.87

బిడ్డల గొంతు ఎండకుండా..
- మదర్ మిల్క్ బ్యాంక్‌తో నవజాత శిశువులకు మేలు
- తల్లి పాలు లేని పిల్లలు, బరువు తక్కువగా పుట్టిన వారికి ప్రయోజనం
- ఇప్పటివరకు 5,476 మంది శిశువులకు పాలు



ఆటోమెటిక్ బ్రెస్ట్ పంప్ ద్వారా పాలు అందజేస్తున్న తల్లి



ఫ్రిజ్‌లో నిల్వ చేసిన పాల సీసాలు

ఆరు నెలలు అవకాశం
కొందరు మహిళలకు శిశువు జన్మించగానే సరిపడా పాలు వస్తాయి. ఇంకొందరిలో రకరకాల కారణాలతో పాలు రాక శిశువులకు ఇబ్బంది ఏర్పడుతోంది. అంతేకాక బరువు తక్కువగా జన్మించే పిల్లలకు అవసరమైన పాలు తల్లుల నుంచే లభించే పరిస్థితి ఉండడం లేదు. ఇక మరికొందరు తల్లులకు వారి పిల్లలకు అవసరమైన దాని కంటే ఎక్కువ పాలు వస్తుంటాయి. ఇలాంటి వారు స్వచ్ఛందంగా ముందుకొస్తే ప్రత్యేక యంత్రాల(ఆటోమెటిక్ ఎలక్ట్రిక్ బ్రెస్ట్ పంప్) ద్వారా పాలు సేకరించి ఇక్కడ నిల్వ చేస్తారు. ఒకసారి సేకరించిన తల్లిపాలను ఆరు నెలల పాటు భద్రపరిచే అవకాశం ఉంది.

90శాతం ప్రసవాలు ఇక్కడే..
జిల్లాలో 30 పీహెచ్‌సీలు, ఆరు ఏరియా ఆస్పత్రులు, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనే 90శాతం మేర ప్రసవాలు జరుగుతుంటాయి. జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్, కొత్తగూడెం తదితర జిల్లాల నుంచి గర్భిణులు ఇక్కడకు ప్రసవాల కోసం వస్తుండగా నిత్యం 25 – 30 వరకు ప్రసవాలు చేస్తారు. ఇక్కడకు వచ్చే గర్భిణుల్లో కొందరికి పౌష్టికాహార లోపం కారణంగా తక్కువ బరువుతో శిశువులు జన్మిస్తుంటారు. ఇలాంటి సమయాన చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండకపోగా, తల్లికి పాలు రాని సందర్భాలు ఎదురవుతుంటాయి. ఇక కేజీన్నర బరువు లోపు ఉన్న చిన్నారులను నవజాత శిశు సంరక్షణ కేంద్రంలోని వార్డుల్లో ఉంచి చికిత్స అందిస్తుండగా ఆ సమయాన తల్లి పాలు పట్టించడం కుదరదు. ఇలాంటి వారికి మిల్క్ బ్యాంక్‌లో నిల్వ చేసిన పాలతో మేలు జరుగుతోంది. ఆస్పత్రి సిబ్బంది సైతం నిత్యం బాలింతలు, తల్లులకు ఈ విషయమై అవగాహన కల్పిస్తుండడంతో అదనంగా పాల లభ్యత ఉన్నవారు ఇచ్చేందుకు ముందుకొస్తున్నారు.

అత్యవసరాల్లో సంజీవిని
పాలు ఇచ్చేందుకు తల్లులు మొగ్గు చూపిస్తుండడంతో సేకరించాక ఎంసీహెచ్‌లోని మెగా మదర్ మిల్క్ బ్యాంక్‌లో నిల్వ చేస్తున్నారు. మిల్క్ బ్యాంక్ ప్రారంభించినప్పటి నుంచి గత ఏడాది డిసెంబర్ వరకు 5,476 మంది శిశువులకు ప్రయోజనం కలిగింది. అంతేకాక తల్లులు సైతం తమ పాలను నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ.. అవసరమైన అవే పాలు వారి శిశువులకు పడుతున్నారు. అలా ఇప్పటి వరకు 912 లీటర్లు నిల్వ చేసి వారి పిల్లలకే పట్టించారు. కాగా, ఎంసీహెచ్‌లోని తల్లి పాల సేకరణ కేంద్రం 24 గంటలు అందుబాటులో ఉంటుండగా, మెడికల్ ఆఫీసర్‌తో పాటు మేనేజర్, మైక్రోబయాలజిస్ట్, ఆరుగురు స్టాఫ్‌నర్సులు, ఒక పేషంట్ కేర్ సేవలందిస్తున్నారు. ఇదే కేంద్రం నుంచి శిశు గృహలోని చిన్నారులకు సైతం ఇప్పటి వరకు 83లీటర్ల పాలు పంపించారు.

ఎంతో ఉపయోగం...



ఎస్ఎన్‌సీయూలో చికిత్స అందించే పిల్లలకు మిల్క్ బ్యాంక్ ఉపయోగపడుతోంది. శిశుగృహలోని చిన్నారులు, ఇతర ఆస్పత్రుల్లో ప్రసవించి పాలు రాని మహిళల పిల్లలకు సమకూరుస్తున్నాం. అవసరానికి మించి పాలు ఉన్న తల్లులెవరైనా కేంద్రానికి ఇవ్వొచ్చు.
– బాబు రత్నాకర్, ఎంసీహెచ్ పీడీయాట్రిక్ హెచ్ఓడీ

స్వచ్ఛందంగా ఎవరైనా ఇవ్వొచ్చు..



ఇక్కడి మిల్క్ బ్యాంక్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా పాలు నిల్వ చేసే సామర్థ్యం ఉంది. బాలింతలు స్వచ్ఛందంగా ఇక్కడ పాలు ఇవ్వొచ్చు. 250 ఎం.లీ., 120 ఎం.లీ. బాటిళ్లలో పాలు పట్టి ఫ్రిజ్‌ల్లో స్టోర్ చేస్తాం. ఒక తల్లి నుంచి 10 మి.లీ. మొదలు ఎంతైనా సేకరిస్తున్నాం.
– ఎస్.రమ్య, మిల్క్ బ్యాంక్ మేనేజర్

రాజీతోనే మానసిక ప్రశాంతత

- ఇరుపక్షాల గెలుపు లోక్ అదాలత్‌తోనే సాధ్యం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్



రాజీపడిన దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్: లోక్ అదాలత్‌లో ఇరుపక్షాలకు రాజీ పడడం ద్వారా కక్షిదారులకు మానసిక ప్రశాంతత లభిస్తుందని, తద్వారా ఇద్దరూ గెలిచినట్లవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇరువర్గాల కక్షిదారులు రాజీ పడితే ఆర్థిక ప్రయోజనాలతో పాటు సమయం వృథా జరగదని, కేసులు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. ఇక్కడ జారీ చేసే అవార్డు సుప్రీంకోర్టు అవార్డుతో సమానమని పేర్కొన్నారు. అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి మాట్లాడుతూ కేసుల తక్షణ పరిష్కారం లోక్ అదాలత్‌తోనే సాధ్యమవుతుందని, ఇక్కడ తీర్పుపై అప్పీల్‌కు అవకాశం లేదని చెప్పారు. కాగా, మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి కే.వీ.చంద్రశేఖరరావు అధ్యక్షత వహించగా మోటార్ ప్రమాదంలో భర్తను కోల్పోయిన మహిళకు రూ.14 లక్షల పరిహారం జారీ చేశారు. అలాగే, రాజీపడిన భార్యాభర్తలు కలిసి జీవించడానికి నిర్ణయించుకోగా వారికి పూల మొక్క అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు ఎం.అర్చనాకుమారి, దేవినేని రాంప్రసాద్‌రావు, ఎం.కల్పన, వి.శివరంజని, కాసురగడ్డ దీప, బిక్కం రజని, ఏపూరి బిందు ప్రియ, వి.మాధవి, బి.నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

19,345 కేసుల పరిష్కారం
జిల్లా కోర్టుతో పాటు జిల్లాలోని కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 19,345 కేసులు పరిష్కారమయ్యాయి. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌ల మాదిరిగానే ముందు నుంచి విస్తృత ప్రచారం చేయడంతో అత్యధిక కేసులు పరిష్కారమయ్యాయని భావిస్తున్నారు. కాగా, మోటార్ వాహన ప్రమాద బీమా కింద 62 కేసుల్లో రూ.2,71,77,000 పరిహారం చెల్లింపునకు బీమా కంపెనీలు అంగీకరించాయి.

పరిష్కారమైన కేసుల వివరాలు

క్రిమినల్ కేసులు	643
సివిల్, భూతగాదా కేసులు	51
మోటార్ యాక్సిడెంట్ కేసులు	62
ట్రాఫిక్ చలానా కేసులు	16,169
ప్రీ లిటిగేషన్ కేసులు	18
డ్రంక్ అండ్ డ్రైవ్, స్మాల్ కాజ్ కేసులు	2,318
కుటుంబ తగాదా కేసులు	06
సైబర్ నేరాల కేసులు	18
ఇతర కేసులు	60

■ఖమ్మంక్రైం: జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా పెద్దసంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ సిబ్బందిని కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు. పకడ్బందీ ప్రణాళికతో రాజీ పడదగిన కేసులను గుర్తించడమే కాక కక్షిదారులను ఒప్పించడంలో ఏఏస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది కృషి చేయడంతో మెరుగైన ఫలితం వచ్చిందని శనివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

విజేతల స్ఫూర్తితో రాణించాలి



సన్మానం అందుకున్న సూపర్‌వైజర్లు, కండక్టర్లతో ఆర్ఎం సరిరామ్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: వివిధ రంగాల్లో విజయం సాధించిన మహిళలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతూ కష్టపడే వారు రాణించడం సులువవుతుందని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సుమలత తెలిపారు. ఆర్టీసీ ఖమ్మం రీజియన్ ఆధ్వర్యాన ఖమ్మం కొత్త బస్టాండ్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో కాలు మోపడమే కాక విజయాలు సాధిస్తున్నారని తెలిపారు. ఆర్ఎం సరిరామ్ మాట్లాడుతూ ఇంటి నుంచి మార్పు మొదలైతేనే సమాజంలో కూడా సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా రీజియన్ పరిధిలో అత్యుత్తమ పనితీరు కనపరచిన మహిళా సూపర్‌వైజర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) జీ.ఎస్.పవిత్ర, ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్, పర్సనల్ ఆఫీసర్ బాలస్వామి, మెడికల్ ఆఫీసర్ సాయిసుష్మ, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణంలో స్వామివారు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో స్వామివారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజలు చేశారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

సాగుకు ఢోకా లేకుండా...



సాగర్ ప్రధాన కాల్వలో ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

- సాగర్ జలాల సరఫరాలో ఇక్కట్లు రాకుండా పర్యవేక్షణ
- వచ్చే నెల రెండో వారం వరకు విడుదల
- ఆతర్వాత తాగునీటి అవసరాలకు వినియోగం

ఖమ్మంఅర్బన్: ఈ ఏడాది రబీలో జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన పంటలకు నష్టం జరగకుండా సాగర్ కాల్వలతో పాటు ఇతర ప్రాజెక్టుల ద్వారా నీరందించేలా జలవనరుల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సాగర్ ఆయకట్టు కింద 2.54 లక్షల ఎకరాలకు తోడు చెరువులు, భక్తరామదాసు, ఇతర ఎత్తిపోతల పథకాల కింద మొత్తంగా నాలుగు లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. జిల్లాలో అత్యధిక ఆయకట్టు సాగర్ జలాలతోనే సాగవుతోంది. దీంతో పంటలకే కాక తాగునీటి అవసరాలకు 28 టీఎంసీలు కేటాయించారు. రబీ పంటలకు వారబందీ విధానంలో నీరు విడుదల చేస్తుండగా ఇప్పటికే ఏడు తడుల్లో ఐదో తడి కొనసాగుతోంది. ఈమేరకు సుమారు 17 టీఎంసీల మేర వాడకం పూర్తయిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

రెండు భాగాలుగా విభజన
సాగర్ నీటి పంపిణీ కోసం జిల్లా ఆయకట్టును రెండు భాగాలుగా చేశారు. ఏన్కూరు ఎగువ వరకు ఏడు రోజులు ఆన్, దిగువకు ఎనిమిది రోజులు ఆన్ విధానంలో సాధ్యమైనంత మేర ఆయకట్టుకు నీరు అందేలా విడుదల చేస్తున్నారు. మరోపక్క ప్రభుత్వం కూడా పంటలకు నీటి ఎద్దడి రానివ్వొద్దని, ఎక్కడా వృథా కాకుండా సరఫరా చేయాలని చెబుతోంది. ఈ నెలాఖరు వరకు శ్రమిస్తే చాలావరకు పంటలు చేతికందే అవకాశముండడంతో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కొన్నిచోట్ల చివరి ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండిపోయాయని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆందోళనలు చేస్తుండడంతో అధికారులు అప్రమత్తమై వారబందీ విధానంలో ఇబ్బంది తలెత్తకుండా నీటి సరఫరా చేస్తున్నారు.

సాగు పూర్తయ్యాక తాగునీరు
ఏప్రిల్ రెండో వారం వరకు సాగు అవసరాలకు నీరు విడుదల చేయనున్నారు. ఆతర్వాత లంకాసాగర్, వైరా, పాలేరు రిజర్వాయర్లతోపాటు చిన్న, మధ్య తరహా చెరువులను సైతం నింపడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నీరు వేసవిలో తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తారు. ఈమేరకు గత మంగళవారం జిల్లాలో పర్యటించిన జలవనరుల శాఖ ఇన్‌చార్జ్ సీఈ రమేష్‌బాబు నీటి సరఫరా తీరు, ఆయకట్టులో సాగుపై ఇంజనీర్లతో సమీక్షించారు. చివరి ఆయకట్టు వరకు నీరు సరఫరా చేయడమేకాక వృథాను అరికట్టడంపైనా దృష్టి సారించాలని సూచించారు. సాగర్ ప్రధాన కాల్వ ద్వారా ఇన్‌ఫ్లో ఆరు వేల క్యూసెక్కులు వచ్చినప్పుడు తొమ్మిది రోజులు ఆన్, ఏడు రోజులు ఆఫ్ విధానం అమలుచేశారు. అయితే, సాగర్ నీరు జిల్లాకు చేరే సరికి 3 – 4 వేల క్యూసెక్కుల మధ్యకు తగ్గుతుండడంతో ఆన్ – ఆఫ్ విధానంలో మార్పులు చేసి జిల్లా ఆయకట్టును రెండు భాగాలుగా విభజించి నీరు అందిస్తున్నారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..
జిల్లాలోని చివరి ఆయకట్టుకు వరకు సాధ్యమైనంత మేర నీటి ఎద్దడి ఎదురుకాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మా శాఖ ఇంజనీర్లు నిత్యం పర్యవేక్షిస్తూ వారబందీ విధానంలో నీరు వృథా కాకుండా చూస్తున్నారు. ప్రస్తుతం ఐదో తడి కొనసాగుతుండగా.. మొత్తంగా ఏడు తడుల్లో నీరు ఇచ్చేలా కార్యాచరణ రూపొందించాం.
– రమేష్‌బాబు ఇన్‌చార్జ్ సీఈ, జలవనరుల శాఖ

బాలికల ఫుట్‌బాల్ టోర్నీ విజేత మేడేపల్లి

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ టర్ఫ్ ఫుట్‌బాల్ కోర్టులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లాస్థాయి బాలికల ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన ఈ పోటీల్లో మేడేపల్లి బాలికలు టైటిల్ దక్కించుకుంది. ఈమేరకు విజేత జట్టుకు అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ట్రోఫీ అందజేశారు. డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్‌తో పాటు కిషోర్, రమణ, సాయిశివ, శరత్, ఎలీషా, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఎదుట లొంగిపోయిన చారి

లింగ నిర్ధారణ పరీక్షల కేసులో ప్రధాన నిందితుడు

చింతకాని: చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న కేసులో ప్రధాన నిందితుడైన ఖమ్మం బల్లేపల్లికి చెందిన సల్లోజు వెంకటేష్ అలియాస్ చారి శనివారం పోలీసులు ఎదుట లొంగిపోయాడు. కారులో తిరుగుతూ గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల గుర్తించిన విషయం విదితమే. ఈమేరకు చింతకాని మండలం కొదుమూరుకు చెందిన రాచబంటి మనోజ్, ఖమ్మంకు చెందిన అల్లీపురం కాత్యాయని గత నెల 27న పట్టుబడ్డారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఆర్ఎంపీ చారి పరారీలో ఉండడంతో విచారణ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యాన ఆయన కోసం గాలిస్తుండగా శనివారం పోలీసులకు లొంగిపోయాడు. ఈమేరకు ఎక్కడెక్కడ ఎందరు గర్భిణులకు పరీక్షలు చేశారు, ఎవరికైనా అబార్షన్ చేయించారా, ఏయే ఆస్పత్రులకు తీసుకెళ్లారనే అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేశాక వివరాలు వెల్లడిస్తామని ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

న్యూస్‌రీల్

రైల్వే లైన్ పనులు త్వరగా ప్రారంభించండి

కేంద్ర రైల్వే మంత్రికి మంత్రి తుమ్మల లేఖ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పాండురంగాపురం – మల్కాన్‌గిరి రైల్వేలైన్ మంజూరు చేయడంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైల్వే మార్గాన్ని తొలిదశలోనే సారపాక వరకు త్వరగా పూర్తిచేస్తే భక్తులు రైలులో చేరుకుని, అక్కడి నుంచి ఇతర వాహనాల్లో భద్రాచలానికి చేరుకునే వీలుంటుందని మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. తద్వారా భద్రాచలానికి వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఇదే సమయాన సత్తుపల్లి – కొవ్వూరు, పెనుబల్లి(ఖమ్మం) – కొండపల్లి(అమరావతి) వరకు కొత్త రైల్వేలైన్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ఆ లేఖలో తుమ్మల కోరారు.

జమలాపురంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌తో ఆలయ ఆవరణలోని స్వామివారి పాదానికి పంచామృతంతో అభిషేకం చేయగా, పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన స్వామి, అమ్మవార్ల నిత్యకల్యాణం, పల్లకీసేవ జరిపించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈనెల 27న బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మం లీగల్: తెలంగాణ బార్ కౌన్సిల్ ఆదేశానుసారం ఈనెల 27న ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న తుది ఓటర్ల జాబితా ప్రకటన ఉంటుందని, 17 నుంచి 20 వరకు నామినేషన్ దాఖలు, పరిశీలన చేపట్టాక అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారని పేర్కొన్నారు. ఆపై ఉపసంహరణకు అవకాశం ఇచ్చి 27న ఎన్నికల నిర్వహణ, అదే రోజు ఫలితాల వెల్లడి ఉంటుందని తెలిపారు.

గురుకుల అధ్యాపకురాలికి డాక్టరేట్



శంకరజ్యోతి

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకురాలు జి.శంకర జ్యోతికి డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ రెగ్యులర్ డోమినేషన్ ఇన్ లిటాక్స్ గ్రాఫ్స్' అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఓయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన శంకరజ్యోతి ప్రస్తుతం తనికెళ్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రజిత, వైస్ ప్రిన్సిపాల్ బి.రాజేశ్వరి, అధ్యాపకులు అభినందించారు.

వీల్‌చైర్ క్రికెట్ క్రీడాకారులను అభినందించిన ఎంపీ



క్రీడాకారులతో ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ టోర్నీలో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులను ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శనివారం అభినందించారు. జిల్లాకు చెందిన ఎస్.కే.సమీరుద్దీన్, బండి రాము, సురేష్, రమావత్ కోటేశ్వర్, మహ్మద్ సమీ జట్టు విజయానికి తోడ్పడ్డారు. ఈ సందర్భంగా వారిని ఎంపీ ఖమ్మంలో సన్మానించగా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పాపానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో గళం విప్పుతా..
ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ పనులకు నిధులు కేటాయించేలా పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఎంపీల సమావేశం జరగగా ఆయన మాట్లాడారు. కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు, పాలేరు నియోజకవర్గం మీదుగా వెళ్లే రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పు, బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఆధునిక విధానాలతో లాభసాటిగా సాగు



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త చైతన్య

వైరా: రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చని వైరా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య తెలిపారు. వైరాలోని ఠాగూర్ విద్యాలయంలో శనివారం నిర్వహించిన మహిళా రైతు సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోకపోతే నష్టపోయే ప్రమాదముంటుందన్నారు. కాగా, సాగులో మహిళల శ్రమ అనిర్వచనీయమని కొనియాడారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాల్లో మహిళలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సదస్సులో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబుతో పాటు బొంతు సమత, శీలం ఫకీరమ్మ, నర్వనేని పద్మావతి, చింతనిప్పు సులోచన, గాలి అరుణ, దొడ్డపనేని జ్యోతి, కిలారు లక్ష్మి, చింతనిప్పు చలపతిరావు, శ్రీనివాస రావు, మధు, సాంబశివరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

అతిథులకు ఆహ్వానం..



ఐటీడీఏ మ్యూజియం ప్రాంగణంలో సిద్ధమైన గిరిజన పల్లె

- భద్రాచలంలో ఆధ్యాత్మికతతోపాటు వినోదం
- ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటున్న గిరిజన మ్యూజియం ఆవరణ
- ఐటీడీఏ ప్రాంగణంలో పార్క్, ఓపెన్ జిమ్ పూర్తి
- ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, పీఓ

భద్రాచలం: ఏజెన్సీ అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు, రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్వానం పలికేందుకు భద్రాచలంలో గిరిజన మ్యూజియం సిద్ధమవుతోంది. చిన్నారులను ఆటపాటలతో అలరించనుంది. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు వీక్షకులకు తెలిసేలా రూపుదిద్దుకుంటోంది. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ పర్యవేక్షణలో పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

శరవేగంగా పనులు..

భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంలో ఆదివాసీల దుస్తులు, పనిముట్లు, వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా మ్యూజియం ప్రాంగణంలో 'గిరిజన పల్లె'తరహాలో వెదురు, మట్టి నిర్మాణాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. చిన్నారుల ఆటపాటలకు బొమ్మలతో పార్క్, ఓపెన్ జిమ్ సిద్ధం చేశారు. చిన్నారులు పెడల్ బోటింగ్ చేసేందుకు పాండ్ రూపొందించారు. యువత, పెద్దలకు బీచ్ తరహాలో 'ఇసుక వాలీబాల్', బాక్స్ క్రికెట్, షెటిల్ కోర్టులను సిద్ధం చేస్తున్నారు. వీటి పనులు శరవేగంగా సాగుతుండగా, గిరిజన వంటకాలతో స్టాల్స్, గిరిజన ఉత్పత్తులు, వస్తువుల స్టాల్స్‌ను సైతం రెడీ చేస్తున్నారు.



చిన్నారుల కోసం సిద్ధమైన పార్క్



చిల్డ్రన్ పెడల్ బోటింగ్ కోసం సిద్ధం చేసిన పాండ్

శ్రీరామనవమిలోగా అందుబాటులోకి..

ముక్కోటి నాటికి గిరిజన పల్లె పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని భావించారు. కానీ కలెక్టర్, పీఓ సూచనల మేరకు ఎంటర్‌టైన్‌మెంట్ కల్పించేలా మరికొన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పెడల్ బోటింగ్, ఓపెన్ జిమ్, పార్క్‌లను సిద్ధం చేశారు. వచ్చే నెల 6న శ్రీరామనవమి జరగనున్న నేపథ్యంలో ఈ నెల 30వ తేదీ లోపు అన్ని పనులు పూర్తి చేయాలని పీఓ ఆదేశాలు జారీ చేశారు. ఈసారి శ్రీరామనవమికి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆధ్యాత్మికతతోపాటు ఆట పాటలతో వినోదం కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

పవిత్రమాసం.. రంజాన్



ముస్లింలతో దీక్ష విరమింపజేస్తున్న పువ్వాడ

● ఖమ్మంమయూరిసెంటర్: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని, ముస్లింలు నియమనిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం గట్టయ్యసెంటర్‌లోని మజీద్ ఈ హాలీమా ఖాతున్‌లో శనివారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్‌తో పాటు బచ్చు విజయ్‌కుమార్, షంషుద్దీన్, మస్జిద్ కమిటీ బాధ్యులు ఎం.డీ.సాబీర్‌పాషా, ఎం.డీ.మన్నాన్, ఎం.డీ.రజాక్, ఎం.డీ.ఖాజా, జునయీమ్, ఆసిఫ్, జవాద్, అబ్దుల్ గఫార్, ఖాజా మెనుద్దీన్, అబ్బాస్, ముజాహిద్, తోసిఫ్, ఫిరోజ్, మున్నా, చోటు, చంటి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం బీఆర్ఎస్ కృషి..

మహిళా సాధికారత కోసం బీఆర్ఎస్ కృషి చేస్తూ వారికి సముచిత గౌరవం కల్పించామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ చైర్మన్ భారతీరాణిని సన్మానించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు కొల్లు పద్మ, బచ్చు విజయ్‌కుమార్, షకీనా, సుజాతరెడ్డి, ఉబ్బలపల్లి నిరోష, ఊర్మిళ, ఝాన్సీ, మాధవి, శైలజ పాల్గొన్నారు.

● ఖమ్మం అర్బన్: ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మానవత్వం చాటుకున్నారు. పువ్వాడ ఖానాపురం వెళ్తుండగా ఖమ్మం – ఇల్లెందు రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. దీంతో ఆయనను ఆస్పత్రికి పంపించడమే కాక వైద్యులకు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించేలా సూచనలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరో నెలలో పెళ్లికి సిద్ధమవుతుండగా ఘటన



కళ్యాణ్ (ఫైల్)

కారేపల్లి: మండలంలోని సూర్యతండా గ్రామానికి చెందిన యువకుడు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం మిర్యాలపెంట సమీపాన శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యతండాకు చెందిన బానోతు కళ్యాణ్ (26), అజ్మీరా విజయ్ ద్విచక్రవాహనంపై శుక్రవారం గంగారం మండలం ఒట్టయిగూడెంలో తన స్నేహితుడి పెళ్లికి వెళ్లి రాత్రి తిరిగి వస్తున్నారు. ఈక్రమాన మిర్యాలపెంట వద్ద బైక్ అదుపు తప్పి వాహనం నడుపుతున్న కళ్యాణ్‌కు రోడ్డుపక్కన ఉన్న చెట్టు దుంగ బలంగా తాకడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. విజయ్ స్వల్పగాయంతో బయటపడ్డాడు. దీంతో స్థానికులు వీరిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే కళ్యాణ్ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం ఆయన మృతదేహాన్ని సూర్యతండాకు శనివారం తీసుకొచ్చారు. కాగా, కళ్యాణ్‌కు రెండు నెలల క్రితమే వివాహం నిశ్చయమైంది. హోలీ పండుగ తర్వాత ముహూర్తం పెట్టుకోవాలని భావిస్తుండగానే ఆయన మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

పోలీసు లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు

నివాళులర్పించిన మంత్రి తుమ్మల, మాజీ మంత్రి పువ్వాడ



జవహర్‌లాల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నాయకులు

రఘునాథపాలెం: సిద్దిపేట జిల్లాలో శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ బానోత్ జవహర్‌లాల్ మృతి చెందగా, స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం ఈర్లపుడిలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు జవహర్‌లాల్ మృతదేహం వద్ద నివాళులర్పించి ఆయన సోదరుడు, మాజీ మదన్‌లాల్, కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం కమాండెంట్ బి.శివప్రసాద్, అడిషనల్, అసిస్టెంట్ కమాండెంట్లు ఏ.అంజయ్య, ఎస్.కే.రషీద్, ఆర్ఎస్ఐ ఏ.నవీన్, రఘునాథపాలెం సీఐ ఎస్.కే.ఉస్మాన్ షరీఫ్, ప్రొబెషనరీ ఎస్సై తేజేశ్వర్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలతో వారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బంది, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు వీరూనాయక్, బచ్చు విజయ్‌కుమార్, గొల్లపూడి హరికృష్ణ, మానుకొండ రాధాకిషోర్, బాషా, శెట్టి రంగారావు, బానోతు బద్రునాయక్, భూక్యా ఉపేంద్రబాయి, స్పందన, జ్యోతి, బోడ వీరన్ననాయక్ తదితరులు కూడా నివాళులర్పించారు. కాగా, జవహర్‌లాల్ మృతిపై ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న స్థానికులు

ఏన్కూరు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. ఏన్కూరు మండలం టీఎల్‌పేటకు ఇందిరానగర్ కాలనీకి చెందిన పసుపులేటి కృష్ణ శుక్రవారం రాత్రి కాలనీ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం శనివారం మధ్యాహ్నం మృతదేహం ఏన్కూరు సెంటర్‌కు చేరుకోగా బంధువులు, గ్రామస్తులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఎస్ఐ షేక్ రఫీ సిబ్బందితో చేరుకుని నచ్చచెప్పినా వినలేదు. గంటకు పైగా ఆందోళన చేపట్టడంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈక్రమాన పోలీసులు – ఆందోళనకారులకు తోపులాట జరగగా, చివరకు వారిని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ద్విచక్రవాహన విక్రయాల్లో డీలర్ల మధ్య విభేదాలు

పెనుబల్లి: హీరో వాహనాల అమ్మకం విషయంలో డీలర్ల మధ్య విబేధాలు తలెత్తగా పరస్పరం చేసిన ఫిర్యాదులతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు వీఎం బంజర ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. ఖమ్మంకు చెందిన హీరో షోరూం యజమాని ఈశ్వరప్రగడ హరిబాబు జిల్లాలో మెయిన్ డీలర్‌గా కొనసాగుతూ వీఎం బంజర్, కల్లూరు, వైరా, బోనకల్ తదితర ప్రాంతాల్లో ఆరుగురు రిటైల్డ్ డీలర్లుకు వాహనాలు సమకూరుస్తున్నాడు. అయితే, ఆయన ఎక్కువ కమీ షన్ తీసుకుంటున్నాడని చెబుతూ కొందరు భద్రాచలం నుంచి ద్విచక్రవాహనాలను తెచ్చుకుని అమ్ముతున్నారు. ఈవిషయమై హరిబాబు తనకు మాత్రమే అనుమతి ఉండగా ఇతర చోట్ల నుంచి వాహనాలు ఎందుకు తీసుకొస్తున్నారని పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లోని దుర్గా మోటార్స్ హీరో షోరూంకు చేరుకుని వాహనాలను ధ్వంసం చేశాడు. దీంతో యజమాని పి.చైతన్యరెడ్డి ఫిర్యాదుతో హరిబాబు, ఆయన కుమారుడు రంగనాథ్‌పై కేసు నమోదు చేశారు.

అయితే, అగ్రిమెంట్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని రంగనాథ్ చేసిన ఫిర్యాదుతో పెసర చైతన్యరెడ్డి, పి.రాము, శ్రీనివాస్, ఎం.రామకృష్ణ, బి.మోహన్‌రావు తదితరులతో పాటు వాహనాలు సరఫరా చేస్తున్న భద్రాచలం షోరూం యజమానిపై కేసు నమోదు చేసి ఆరు ద్విచక్రవాహనాలను సీజ్ చేశామని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తే ప్రోత్సాహకాలు



విద్యార్థినికి నగదు అందిస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నేలకొండపల్లి: ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తానని మెదక్ ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన స్వగ్రామమైన మండలంలోని రామచంద్రాపురానికి శనివారం వచ్చారు. ఇంటర్‌లో 982 మార్కులు సాధించిన కేశా నవ్యకు గ్రామస్తులు రూ.1.40 లక్షల బహుమతి ప్రకటించగా ఆయన అందజేసి మాట్లాడారు. రానున్న పరీక్షల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు రూ.10 వేల నగదు బహుమతులు అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, ఎల్.వెంకట్రాంరెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, డి.వీరారెడ్డి, డి.గోవిందరెడ్డి, పి.లక్ష్మీనారాయణ, ఏడుకొండలు, బైరం దినేష్ కుమార్, కేశా సత్యనారాయణ, మధారమ్మ, ఉపేందర్, విక్రమ్ పాల్గొన్నారు.

సాగునీటి విషయంలో ఇరువర్గాల ఘర్షణ

వైరారూరల్: మండలంలోని ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి తరలింపులో లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ వెంగళ కృష్ణ, ఆయకట్టు రైతు ఎనిక కోటేశ్వరరావు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గత నెల 22న రైతు కోటేశ్వరరావు పథకం పరిధిలో లేని మరో ఐదెకరాలకు సాగునీరు పెట్టుకున్నాడని చైర్మన్ కృష్ణ నిలదీశాడు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరగడంతో అదేరోజు కృష్ణ వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత శనివారం లిఫ్ట్ పరిధిలో రైతులు చెల్లించాల్సిన డబ్బు తీసుకురావాలని పుణ్యపురానికి చెందిన గద్దె వసంతరావును పంపించి, కృష్ణ సైతం వెళ్తుండగా కోటేశ్వరరావు, రాధిక అడ్డుకుని కులం పేరుతో దూషించి కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే సమయాన రాధిక సైతం తన భర్తను కృష్ణ కొట్టాడని ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇంటి స్థల విషయమై...

కారేపల్లి: ఇంటి స్థల విషయమై కారేపల్లిలో శనివారం ఇరుపక్షాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సర్వే నంబర్ 163లో రెండు గుంటల ఇంటి స్థలం వాంకుడోతు హీరామణి పేరుతో రిజిస్ట్రేషన్ కాగా, సర్వే నెంబర్ 172లో పది గుంటల ఇంటి స్థలం రమాదేవి పేరుతో రిజిస్ట్రేషన్ అయింది. అయితే, రెండు గుంటల ఇంటి స్థలం తమదంటే తమదని ఇరువర్గాలు వాగ్వాదానికి దిగాయి. ఈక్రమంలో ఘర్షణ చోటు చేసుకోగా పోలీసులు చేరుకుని సర్దిచెప్పారు. ఏదైనా సమస్య ఉంటే న్యాయపరంగా పరిష్కరించుకోవాలే తప్ప ఘర్షణలకు దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.